# అనుకోని అదృష్టం



అప్పుడప్పుడు మొక్కుకున్న ఆపద మొక్కులన్నిటినీ ఒకసారే తీర్చే ఉద్దేశంతో, సతీ సంతాన సహితంగా ఆ ఏడుకొండల వాని దర్శనానికై తిరుపతికి వెళ్లాను.

పలుకుబడిగల స్నేహితుల పుణ్యమా... అని, తిరుమలపై ఏ ఇబ్బందీ లేకుండా వసతి సౌకర్యం, ఆపైన దైవదర్శనం లభించాయి.

మూడోనాడు అమ్మవారి దర్శనం కోసం,' అలివేలు మంగాపురం వెళ్లడానికోసం, దిగువ తిరుపతికి వచ్చాం. అమ్మవారి దర్శనం కూడా ఏ ఆటంకం లేకుండా జరిగిపోయింది.

మా తిరుపతి యాత్ర నిర్విఘ్నంగా జరిగిపోవడంతో, మనస్సు ఎంతో తృప్తితో నిండిపోయింది. అంతా ఆ ఏడుకొండల వాని చలువేనని అనుకుంటూ మనస్సులోనే నమస్కరించుకున్నాను. ఇంక ఆ రాత్రికే తిరుగుప్రయాణం పెట్టుకున్నాం.

అమ్మవారి దర్శనం చేసుకొని తిరిగి వస్తుంటే, పుష్కరిణి ప్రక్కన ఉన్న రోడ్డుమీద నుంచి ఒక ఏనుగు వస్తోంది. దానిని ఉత్సాహంగా చూస్తూ పిల్లలూ, పెద్దలూ కూడా రోడ్డుకి ఇరుప్రక్కలా నుంచున్నారు. ఏనుగుని చూడగానే మా పిల్లలకి కూడా ఉత్సాహం వేసి కేరింతలు కొట్టడం మొదలుపెట్టారు. మేము కూడా రోడ్డు ప్రక్కన నిలబడి దానివంక చూడసాగాం.

ఏనుగు మమ్మల్ని సమీపించింది.

మా దగ్గరకి రాగానే అది ఏమనుకుందో, ఏమో... కొంచెం ప్రక్కకి తిరిగి తొండం ఎత్తి నా నెత్తిన పెట్టింది. చెప్పొద్దూ... తొండంతో కొట్టే కొంచెం నెప్పె పెట్టింది. వెంటనే తిరిగి తన దారిన తాను సాగిపోయింది.

ఆ దృశ్యం చూసేసరికి- నా ప్రక్కనున్న వాళ్ళు ఎంతో ఆశ్చర్యపోయారు.

"ఏనుగు దానంతట అది వచ్చి తొండంతో స్పృశించడం అంటే... సామాన్య విషయం కాదు. మీకేదో గొప్ప అదృష్టం రాబోతోంది. దానికి సూచనే ఇది!" అంటూ చెప్పసాగారు.

మా ఆవిడ కూడా అవునంది. "ఏదో గొప్ప అదృష్టం కలిసివస్తేనే కాని, ఇల్లాంటిది జరగదు" అని వత్తాసిచ్చింది.

ఆ మాటలు వింటున్న నాకు- నిజంగా ఏనుగెక్కినంత ఆనందం వేసింది.

ఆ ఏనుగు వెనకాలే ఒక వ్యక్తి డబ్బా పుచ్చుకుని ధర్మానికి వచ్చాడు. నన్ను ఏనుగు తాకిన సంతోషంలో ఆ డబ్బాలో ఒక రూపాయి వేశాను.

ఈ సంఘటన జరిగినప్పటినుంచి నాకు వేరే ఆలోచన లేదు.

బహుశా... ఏ లాటరీలోనో లక్షలు వస్తాయని ఊహించుకోసాగాను. ఆ సంతోషంతో కడుపు నిండిపోయి, ఆ రాత్రి భోజనం కూడా సరిగ్గా చేయలేకపోయాను.

రాత్రి పదిగంటలకి మా రైలు!

ఎనిమిదింటికి వచ్చి ప్లాట్‌ఫాం మీద కూర్చున్నాం. పిల్లలు అక్కడే నిద్రపోయారు.

రైలు వచ్చి ప్లాట్‌ఫాం మీద ఆగింది. అందులో ఎక్కడానికి జనం త్రోసుకోడం, తొక్కుకోడం మొదలుపెట్టారు.

నిద్రపోతున్న ఒక పిల్లని భుజం మీదవేసుకొని, మరో చేతితో హ్యాండ్‌బ్యాగ్ పుచ్చుకొని ఆ జనంలో నేనూ జొరబడ్డాను.

ఇంకో పిల్లని ఎత్తుకుని మా ఆవిడా.., పెట్టె, బెడ్డింగ్ నెత్తిన పెట్టుకుని కూలివాడు నా వెనకాల వచ్చారు.

ఎలాగయితేనేం- ఆ జనాన్ని చీల్చుకుని లోపలికి వెళ్లగలిగాం. కూలీవాడి నెత్తిన సామాను దింపి, పెట్టె సీటు క్రిందా, బెడ్డింగ్ బెర్త్ పైనా, పెట్టాను.

కూలివాడికి డబ్బులు ఇద్దామని ప్యాంటు జేబులో చెయ్యి పెట్టేసరికి- ఏముందీ..! గుండె ఝల్లుమంది. జేబులో పర్సులేదు. ఎప్పుడూ అనుకోనటువంటిది- ఎప్పుడూ ఊహించనటువంటిది జరిగింది.

పెట్టెలో ఇంకా కొంచెం డబ్బుంది కనుక సరిపోయింది- లేకుంటే... ఏమయ్యేవాళ్లమో! ఏనుగు ముట్టినందుకు అనుకోని అదృష్టం కలిసి వస్తుందని ఊహాలోకాల్లో కలలు కంటున్న నేను ఒక్కసారిగా అథఃపాతాళంలోకి పడిపోయాను. అందుకేనేమో... ఏనుగు కొట్టే నొప్పి పెట్టింది అనిపించింది.

ఏమైతేనేం- అనుకోని సంఘటనకి పర్యవసానం కూడా అనుకోనిదే జరిగింది.

– హాస్యప్రభ... అక్టోబర్ ' 79

## రాత్రివేళైతే పర్వాలేదని..!



చిట్టిబాబుకి ఈమధ్యనే గడ్డం వచ్చింది. ఓ సుముహూర్తం చూసి గడ్డం గీకడానికి శ్రీకారం చుట్టేశాడు కూడా. గడ్డంతోపాటు చర్మం కూడా చెక్కేసుకున్నాడనుకోండి... అది వేరే సంగతి! ఒకరోజు అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటాక బరబర శబ్దం విని వాళ్లన్నయ్యకి మెలకువ వచ్చింది. చూస్తే గడ్డం చేసుకుంటూ చిట్టిబాబు కనిపించాడు.

"ఇదేమిట్రా... అర్ధరాత్రి వేళ అంకమ్మ శివాలని.., ఇప్పుడు మొదలెట్టావేమిటి గడ్డం గీకుడు?" అని అడిగాడు.

"ఏంలేదు. ఇప్పుడు గీసుకుంటే తెల్లారేసరికి గాయాలు మానిపోతాయేమోనని!" అంటూ బోలెడు సిగ్గుపడుతూ చెప్పాడు చిట్టిబాబు.